# అచ్చోసిన ఆంబోతులు



ఆంబోతు పెద్దబజార్లో మధ్యగా నుంచుంది. పొడవైన, నిడివైన పెద్ద బజార్లో బుసలుకొడ్తూ నందికేశ్వరుడిలా నుంచుంది. ఆంబోతు తెల్లగా ఎత్తుగా మంచుకొండలా ఉంది. ఆంబోతుకి అంత కోపం రావటం ఎవ్వరూ చూడలేదు.

పెద్దలు కొందరు "నాయనా! నందీశ్వరా! శాంతించు తండ్రీ!" అంటూ మొక్కుతున్నారు. అంబోతు శాంతించినట్టులేదు. బుసలు ఆగలేదు. మట్టి చిమ్మటం మానలేదు. పెద్ద ముత్తయిదువులు కొందరు గంగడోలు దువ్వి "నందికేశ్వరా కోపమెందుకయ్యా!"అని అంటుంటే తోక విసరటం తగ్గింది కాని విసవిస తొక్కుళ్ళు తగ్గలేదు. కూరలమ్మేవాళ్ళు తోటకూర నోటికందిస్తే విదిలించి కొట్టింది. కృష్ణనుండి నీళ్ళుతెచ్చేవాళ్ళు కావిడినీళ్ళు ముందుపెట్టి "తాగవయ్యా" అంటే తాగినన్ని తాగి కడవలు తన్నేసింది.

వూరు వూరంతా కంగారుగా పెద్దబజార్లో కొచ్చి భయంభయంగా నుంచున్న సమయాన రంగయ్య తన చిల్లరకొట్టు కెళ్ళటానికి వీధిలోకొచ్చాడు. వీధిలోని జనాన్ని చూసి మరికొంచెం ముందుకొచ్చాడు రంగయ్య. రంగయ్యని చూసిన ఆంబోతు చెంగున అంతెత్తు ఎగిరింది. కాలసర్పంలా గాలిలో తోక ఆడించింది.

చెవులు దద్దరిల్లేటట్లు రంకె వేసింది. పాతాళం బద్దలయ్యేటట్లు నేల తొక్కింది.

పరమ భయంకరంగా తనవైపు పరుగెత్తుకొస్తున్న అంబోతుని చూసిన రంగయ్యకు తారెత్తింది. గోచీ వూడిపోతున్నా లెక్కచేయక పరుగులంకించు కున్నాడు.

ఇంటిదాకా తరిమింది. వాకిటిముందు నుంచుని గిట్టల్తో నేలరాస్తూ హుంకరించటం మొదలెట్టింది. రంగయ్య సాగిల పడ్డాడు. అంబోతు రంకెలాపలేదు. మొత్తుకున్నాడు. లబోదిబోమన్నాడు. అంబోతు ఆగలేదు. కరివేపాకు, కొత్తిమీర పెట్టబోయాడు. వాటిని చూస్తూనే విసిరికొట్టింది అంబోతు. రంగయ్యకు తెలుసు అంబోతు ఎందుకొచ్చిందో! ఇంట్లోకెళ్ళి తట్టల్తో తట్టెడు కందులు పోసుకొచ్చి భయంభయంగా అంబోతు ముందుపెట్టాడు. ఆ కందులు చూసి అంబోతు ఆగింది. ఆ కందులన్నీ తిని తట్ట శుభ్రంగా నాకి పరమసాధువులా నడిచి వెళ్ళిపోయింది.

ఆ అడ్డెడు కందులు!

ఉదయం సుబ్బమ్మ తీసుకొచ్చినవి. సుబ్బమ్మ యింట్లో నూకలు లేవు. దానికితోడు అల్లుడొచ్చాడు. ఇంకో గతిలేక ఇంట్లో ఉన్న అడ్డెడు కందులు రంగయ్యకి అమ్మజూపింది. నాలుగురూపాయల కందులకి రూపాయి మించి ఇవ్వనన్నాడు. ఇదేం అన్యాయం అంటే కేకలు. వూళ్ళో అల్లుడున్నాడు. సిగ్గుపడిపోయిన సుబ్బమ్మ అల్లుడికి అన్నం కూరా వండి తను పస్తుండాలి అనుకొని మారుమాటాడకుండా ఆ ఒక్క రూపాయి తీసుకెళ్ళింది. అంబోతు వెళ్ళిపోయింతర్వాత రంగయ్య తాపీగా ఊపిరిపీల్చుకుని పొద్దున్న లాభం గూబలోకొచ్చిందే అని బాధపడ్తూ కొట్టుకెళ్ళాడు. కొట్టుదగ్గర కూర్చుని గల్లాపెట్టెకు దణ్ణం పెట్టుకుని కళ్ళు తెరిచాడో లేదో ఎదురుగా రౌడీ వీరడు నుంచొని ఉన్నాడు.

రౌడీ వీరడంటే రక్తం తాగుతాడని పేరు. వాడు నెత్తురు తాగాడో లేదో కానీ

వాడ్ని చూస్తే కాలయముణ్ని చూసినట్టుంటుంది. నల్లతాచులా సన్నగా బారెడు మనిషి. చింతనిప్పుల్లాంటి కళ్ళు. ఎప్పుడూ మనిషి వూగుతుంటాడు. తాగి వూగుతున్నాడో, ఆ మనిషి తీరే అంతో తెలియదుగాని ఆ ఊపుచూసి జనానికి గుండె చిక్కబట్టుకు పోతోంది. ఆ ఊపులాగా మాట కూడా సాగదీస్తాడు.

"ఏం రంగయ్యబాబు పదిరూపాయలుంటే ఇస్తావేంటి?" అన్నాడు వీరడు.

"బావుందయ్యోవ్, నిన్ననేగా ఐదురూపాయలు తీసికెళ్ళావ్" అన్నాడు కంగారుపడ్తూ రంగయ్య.

"నిన్నటికీ ఇవ్వాళ్టికీ నువ్వేం బేరాలు చెయ్యలేదా? ఏ రోజు అవసరం ఆ రోజే"
"ఇప్పుడేం లేదు పో! బోణీ కాలేదు." - "పోనా .... పోనా" సూటిగా చూస్తూ అన్నాడు. వీరడు

"రంగయ్యా! ఆ పెసలు పల్లపీధి పెసలు....." అంతే, రంగయ్య పడిపోయాడు. "ఓరి నీ అమ్మకడుపు బంగారంగాను, ఎందుకురా గోల ఇదుగో పది తీసుకో' అని రొండినుంచి పది తీసిచ్చాడు. వీరడు ఆ పది రూపాయల్తో గాలి గోపురంలోకి వచ్చి అక్కడున్న బిచ్చగాళ్ళకు తలో రూపాయిచ్చి ఇంటికెళ్ళి పోయాడు.

వీరడి బెడద ఒక్క రంగయ్యకే కాదు. వూళ్ళో చాలామందికి ఉంది. కాల్లో దిగిన తుమ్మముల్లులాంటివాడు వీరడు. తుమ్మముల్లు తీస్తున్నకొద్దీ విరుగుతుంది.

ఒకసారి బంగారం తాకట్టుపెట్టుకుని అప్పులిచ్చే భూషయ్య దగ్గరకెళ్ళాడు వీరడు.

"భూషయ్యగారూ అర్జంటుగా అవసరం వచ్చింది. ఓ వందరూపాయలు కావాలి" అని అల్లుడడిగినట్లు అడిగాడు.

"అహాఁ, అలాగా - వంద చాలా? ఎవడి తాత సొమ్ము ఇమ్మంటావ్?" అన్నాడు భూషయ్య.

"తాతలు సంపాదిస్తే మేమంతా మీదగ్గర కెందుకొస్తామండీ? నిన్న రాత్రి సీతాలు నాన్నాడు, బుచ్చెమ్మ చెవిపోగులు ఎంత ఖరీదుచేశారు." అన్నాడు వీరడు. భూషయ్య నీళ్ళు కారిపోయి "ఒరేయ్! వంద కావలసిందేనా?" అని దీనంగా అడిగాడు.

భూషయ్య దగ్గర వంద తీసుకుని సీతాలు కూతురికీ, బుచ్చెమ్మ కూతురికీ పెళ్ళిళ్ళు జరుగుతుంటే చెరో యాభై పసుపుకుంకుమకింద చదివించి ఇంటికెళ్ళిపోయాడు.

ఇహ లాభంలేదని భూషయ్య, రంగయ్య తీర్మానించుకొని రహస్యంగా పధకం వేశారు. జగ్గడనే రౌడీని పిలిపించారు. వీరణ్ణి చంపి, కిష్టలో పారేస్తే ఐదొందలిస్తామన్నారు. సరేనన్నాడు జగ్గడు. డబ్బు తీసుకున్నాడు. తెల్లారేసరికి వీరడి శవం నీళ్ళలో తేలాలన్నారు. "ఓ"అని వెళ్ళి పోయాడు జగ్గడు.

తెల్లారింది. పీడ విలగడైపోయిందనుకున్నారు ఇద్దరూ.

"భూషయ్యగారో" వాకిట్లోంచి కేక. అది వీరడి గొంతు, వీరడి దయ్యం కాదు గదా!

భూషయ్య అదిరిపడ్డాడు.

"భూషయ్యగారూ!"

వణికిపోతూ వీధిలోకొచ్చాడు భూషయ్య.

వీరడు నవ్వుతూ "ఐదొందలు కావాలండీ" అన్నాడు.

"ఐదొందలా ...." అన్నాడు భూషయ్య.

"మరి జగ్గణ్ణి చంపి కిష్టలో తోసెయ్యొద్దండీ ...."

మారుమాటాడకుండా ఐదొందలిచ్చాడు భూషయ్య.

రంగయ్య ఇంటిముందు ఆంబోతు హుంకరిస్తోంది. గిట్టల్తో నేలతవ్వి చిందరవందర చేస్తోంది.

రంగయ్య నిశ్శబ్దంగా అరబస్తా పెసలు ఆంబోతు ముందు పెట్టాడు. *